క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



నెల్లూరు(బృందావనం): నిజ శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకొని మూలాపేటలోని శంకరమఠంలో చండీ హోమాన్ని భక్తిశ్రద్ధలతో బుధవారం నిర్వహించారు. కంచి కామకోటి పీఠానికి చెందిన వేదపండితుడు సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో హోమాన్ని విశేషంగా జరిపారు. ఉభయకర్తగా పంచాఘ్నుల పవన్‌కుమార్ దంపతులు వ్యవహరించారు. మఠం నిర్వాహకులు కొర్రపాటి నందకిషోర్, ఉషాకుమారి దంపతులు పర్యవేక్షించారు.

కనులపండువగా ఊంజల్‌సేవ



నెల్లూరు(బృందావనం): శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకొని నగరంలోని రాజరాజేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి లలితా సహస్రనామం, ఖడ్గమాల, ఊంజల్‌సేవను భక్తిశ్రద్ధలతో బుధవారం నిర్వహించారు. పూజా కార్యక్రమాలను దేవస్థాన ప్రధానార్చకుడు సూరావఝుల రఘురామశర్మ ఆధ్వర్యంలో అవ్వారి వెంకటరామకృష్ణశర్మ, నరసింహ, దిలీప్ చేపట్టారు. ఉభయకర్తలుగా నల్లగండ్ల మధు, నాగవర్ధినీశ్వరి దంపతులు వ్యవహరించారు. ఈఓ వెంకటశ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ జయరామ్, సభ్యులు దొరబాబు, రామ్మోహన్‌రెడ్డి, పద్మజ పాల్గొన్నారు.

వేడుకగా పవిత్రోత్సవాలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. దేవస్థాన ప్రధానార్చకులు కిడాంబి జగన్నాథాచార్యులు, నిశింద సుదర్శనాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి, సభ్యుడు శేషాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచార కేంద్రంపై దాడి

నెల్లూరు(క్రైమ్): ఇళ్ల మధ్యలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న వ్యభిచార కేంద్రంపై దర్గామిట్ట పోలీసులు దాడులు చేసి నిర్వాహకులను అరెస్ట్ చేసిన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. లేక్‌వ్యూ కాలనీలోని 12వ వీధిలో ఓ ఇంటిని మహేశ్వరి, చంద్రశేఖర్‌రెడ్డి దంపతులు అద్దెకు తీసుకొని నివాసం ఉంటున్నారు. నగరంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి మహిళలను తీసుకొచ్చి వ్యభిచార కేంద్రాన్ని నిర్వహించసాగారు. ఈ విషయమై దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ సుబ్బారావుకు సమాచారం అందింది. ఆయన తన సిబ్బందితో కలిసి ఆ ఇంటిపై నిఘా ఉంచారు. ఈ క్రమంలో ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో ఎస్సై సుబ్రహ్మణ్యం, సిబ్బందితో కలిసి ఇంటిపై మంగళవారం దాడి చేశారు. నిర్వాహకులను అరెస్ట్ చేసి ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకొని హోమ్‌కు తరలించారు. మహిళల కుటుంబసభ్యులకు సమాచారం అందించారు.

ప్రజలు, కార్యకర్తలే కొండంత బలం

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



భారీ కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం : 'వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు నియోజకవర్గ ప్రజలే నా కొండంత బలం' అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని పంచేడు గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఆయన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందు చూపుతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారని, దీని వల్ల ప్రజలకు అందిన లబ్ధిని వివరించడంతో పాటు స్థానిక సమస్యలను తెలుసుకుంటున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా ప్రతి సచివాలయానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేసిందని, వీటితో స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. అలాగే చాలా మంది బాధితులను గుర్తించి తన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ట్రస్ట్ ద్వారా తోచిన సాయాన్ని చేస్తున్నానని, ఇది చాలా సంతృప్తిని ఇస్తోందని తెలిపారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో 99,047 ఇళ్లను సందర్శించినట్లు తెలియజేశారు.

70 మందికి ఇళ్ల పట్టాలు

పంచేడు గ్రామంలో దాదాపు 70 మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశామని ఎమ్మెల్యే ప్రసన్న తెలిపారు. అలాగే ఇందుకూరుపేట మండలం మైపాడులో లక్ష ఇళ్లను పూర్తి చేసిన సందర్భంగా సెప్టెంబర్ 3న సాయంత్రం భారీ బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నామని, ఈ కార్యక్రమానికి ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ హాజరవుతున్నారని తెలిపారు. ఈ సభకు అన్ని మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అధికారులు హాజరుకావాలని కోరారు.

పంచేడులో సంబరాలు

'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం చేపట్టి 99 వేల ఇళ్లను పూర్తి చేసుకోవడంతో పంచేడులో స్థానిక నేతలు 99 కేజీల భారీ కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అలాగే గడప గడపకు కార్యక్రమంపై ఫొటో గ్యాలరీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూండ్ల అచ్యుత్‌రెడ్డి, విడవలూరు, బుచ్చిరెడ్డిపాళెం మండల, పట్టణ కన్వీనర్లు బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, చెర్లో సతీష్‌రెడ్డి, టంగుటూరు మల్లికార్జునరెడ్డి, నగర పంచాయతీ వైస్ చైర్‌పర్సన్ కోటంరెడ్డి లలితారెడ్డి, వైస్ చైర్మన్ షాహుల్, మత్స్యకార నేతలు ఆవుల వాసు, బుచ్చంగారి తిరుపతి, కౌన్సిలర్లు నాగరాజు, ప్రత్యూష, రహమత్, షకీలాబేగం, నస్రీన్, మాల్లారెడ్డి, సత్యనారాయణ, యానాదిరెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం



గొలగమూడిలో శివాలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దంపతులు

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం : గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తానని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గొలగమూడి గ్రామంలో దాతలు, భక్తుల సహకారంతో శివాలయ నిర్మాణానికి బుధవారం నిర్వహించిన భూమి పూజ కార్యక్రమంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతలు, భక్తుల సహకారంతో గొలగమూడిలో శివపార్వతుల ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం కావడం చాలా సంతోషకరమన్నారు. గ్రామంలో ఎంతో విలువైన ప్రభుత్వ భూములకు తరతరాలుగా ఎటువంటి హక్కులు లేకుండా అనుభవిస్తున్న గ్రామస్తులకు త్వరలోనే సంపూర్ణ హక్కులు కల్పించి పట్టాలు అందజేస్తామని పేర్కొన్నారు. సుదీర్ఘకాలంగా ఉన్న అనేక సమస్యలను పరిష్కరిస్తున్నామని, గ్రామాల్లో ప్రజలు కోరుకున్న అభివృద్ధి పనులను చేయడమే కాకుండా సంక్షేమ పథకాలను అర్హులకు అందించేలా కృషి చేస్తున్నామని వివరించారు. సర్వేపల్లి నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకునే విధంగా నిరంతరం పని చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వెంకయ్యస్వామి ఆశ్రమ ఈఓ పి.బాలసుబ్రహ్మణ్యం, మండల వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి కోడూరు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, పార్టీ నేతలు నంబూరు రాజానాయుడు, ఆరుగుంట ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా రాఖీ పౌర్ణమి



ముత్తుకూరు : మంత్రి కాకాణికి రాఖీ కడుతున్న ఎంపీపీ సుగుణమ్మ



మనుబోలు : తన సోదరుడికి రాఖీ కడుతున్న చిన్నారి

మనుబోలు : అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పౌర్ణమి వేడుకలను మనుబోలు మండల కేంద్రంలో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఇళ్లలో ఆడపిల్లలు తమ సోదరులకు రాఖీలు కట్టి సందడిగా గడిపారు. మనుబోలులోని జెడ్పీ ఉన్నత పాఠశాలతో పాటు ప్రాథమిక పాఠశాలల్లో పలువురు చిన్నారులు తమ తోటి విద్యార్థులను సోదరులుగా భావించి రాఖీలు కట్టి తమ అనుబంధాన్ని చాటుకున్నారు.

మంత్రికి రాఖీ కట్టిన ఎంపీపీ

ముత్తుకూరు : మండలంలో రాఖీ పండగ బుధవారం సందడిగా జరిగింది. అన్నదమ్ముల చేతులకు రాఖీలు కట్టిన అక్కచెల్లెమ్మలు తమ ప్రేమానుబంధాన్ని చాటుకున్నారు. ఇందులో భాగంగా ఎంపీపీ గండవరం సుగుణ నెల్లూరులో రాష్ట్ర వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నివాసానికి వెళ్లి రాఖీ కట్టారు. మంత్రి ఆశీర్వచనాలు తీసుకున్నారు. అలాగే, తాళ్లపూడిలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి చేతికి కూడా ఆమె రాఖీ కట్టారు.

- పొదలకూరు : రాఖీ పౌర్ణమి సందర్భంగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి పొదలకూరు బిట్–3 ఎంపీటీసీ సభ్యురాలు గంగవరపు లక్ష్మీకల్యాణి బుధవారం రక్షాబంధన్ కట్టారు. నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రాఖీ కట్టి ఆయన వద్ద ఆశీర్వాదం తీసుకున్నారు.



పొదలకూరు : కాకాణికి రాఖీ కడుతున్న లక్ష్మీకల్యాణి

నేడు మైపాడులో 'గడప గడపకు..'

ఇందుకూరుపేట : మండలంలోని మైపాడులో కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగేంద్రబాబు గురువారం తెలిపారు. అధికారులు, వలంటీర్లు, ప్రజా ప్రతినిధులు తప్పక హాజరు కావాలని సూచించారు.

చెస్ పోటీలో మిథిలేష్ ప్రతిభ



బహుమతి అందుకొంటున్న మిథిలేష్

ముత్తుకూరు : అంతర్జాతీయ చెస్ పోటీలో గోపాలపురంలోని అదానీ వరల్డ్ స్కూల్ ఆరో తరగతి విద్యార్థి పి.మిథిలేష్‌కు ద్వితీయ బహుమతి లభించింది. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా తెలంగాణ స్టేట్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో రెండు రోజులు నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపి ద్వితీయ బహుమతి సాధించినట్లు ప్రిన్సిపల్ సత్యనారాయణ చెప్పారు. బహుమతితో పాటు రూ.9,000ల నగదు, జ్ఞాపికను బహూకరించారని ప్రిన్సిపల్ బుధవారం తెలిపారు.

జీజీఎంపీ పనులను పూర్తి చేయాలి

- డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు



అధికారులకు సూచనలిస్తున్న చలపతిరావు

కొడవలూరు : 'గడప గడపకు మన ప్రభుత్వం'(జీజీఎంపీ)లో మంజూరు చేసిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీజీఎంపీ పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తున్నందున పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. ఆ కమిటీలో ఎంపీపీ, జెడ్పీటీసీతో పాటు ముగ్గురు ఎంపీటీసీ సభ్యులు విధిగా ఉండాలని చెప్పారు. మండలంలో కొత్తగా మంజూరైన సామాజిక పింఛన్‌లను వచ్చే నెల 4వ తేదీన ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జగనన్న కాలనీల్లో అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలను వేగవంతం చేసి త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, హౌసింగ్ ఏఈ పి.సురేష్‌కుమార్, పీఆర్ ఏఈ తాతారావు, డీటీ గున్నం మల్లికార్జున, విజయ డెయిరీ డైరెక్టర్ ఇసనాక సునీల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ఆడిట్‌పై అవగాహన ఉండాలి

- లోకల్ ఫండ్ అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ హరికృష్ణ



ఆన్‌లైన్ ఆడిట్‌పై అవగాహన కల్పిస్తున్న హరికృష్ణ

కొడవలూరు : పంచాయతీ కార్యదర్శులు ఆన్‌లైన్ ఆడిట్‌పై అవగాహన కలిగి ఉండాలని లోకల్ ఫండ్ అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ హరికృష్ణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు ఆన్‌లైన్ ఆడిట్‌పై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి, కుళాయి పన్నుల పైనే కాకుండా యాడ్లు, ఇంటి నిర్మాణ ప్లాన్‌లపై కూడా ఆన్‌లైన్ ఆడిట్ నిర్వహించాల్సి ఉంటుందన్నారు. అందువల్ల వీటిపై కూడా పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తద్వారా పంచాయతీల రాబడి గణనీయంగా పెంచుకోవచ్చని సూచించారు. ఆన్‌లైన్ ఆడిట్‌లో పంచాయతీల రాబడికి సంబంధించిన అన్ని అంశాల పైనా ఆడిట్ ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సహాయ ఆడిట్ అధికారి కవిత, పంచాయతీ కార్యదర్శులు జి.రాధాకృష్ణ, డి.సురేష్‌కుమార్, ఎస్కే.షబ్బీర్, ఎం.బ్రహ్మానందరెడ్డి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆపన్నహస్తం



ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్లు అందుకున్న చిన్నారులతో ఎమ్మెల్యే ప్రసన్న

బుచ్చిరెడ్డిపాళెం : నగర పంచాయతీ పరిధిలోని 19వ వార్డు వవ్వేరు గ్రామంలో తల్లి, తండ్రులను కోల్పోయిన పలువురు చిన్నారులకు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆపన్నహస్తం అందించారు. వవ్వేరు గ్రామానికి చెందిన ఆర్.శ్యామల, ఆర్.అభిరామ్, నాగ చైతన్య, నాగప్రసన్నలకు నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ట్రస్ట్ ద్వారా రూ.20 వేల చొప్పున మొత్తం రూ.80 వేల ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేయించారు. ఆ బాండ్లను బుచ్చిరెడ్డిపాళెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం అందజేశారు.

రూ.2.39 కోట్ల రుణాల మంజూరు

బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని దాదాపు 471 మందికి స్త్రీనిధి ద్వారా రూ.2.39 కోట్లను మంజూరు చేశారు. ఈ మేరకు నమూనా చెక్కును ఎమ్మెల్యే ప్రసన్న అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుధీర్, ఏపీఎం లలితా, పార్టీ నేతలు శ్రీకాంత్‌రెడ్డి, శ్రావన్, మురళీ, వెంకయ్య, ఆదిశేషయ్య, పెంచలయ్య, మురళీ, వెంకటరమణారెడ్డి, అల్లాభక్షు, భరత్, డాక్టర్ అల్లాభక్షు, బాలకృష్ణ, శివ, నాగసుబ్బారెడ్డి, జయచంద్ర, చిన్న అల్లాభక్షు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ప్రయాణం



పొదలకూరు : ఆటోల ప్రయాణం ప్రమాదకరంగా మారింది. గ్రామాల నుంచి వచ్చే ప్రయాణికులు ప్రమాదపుటంచున ప్రయాణాలు సాగిస్తున్నారు. ఆటోల డ్రైవర్లు ప్రయాణికులను కుక్కి తీసుకుని వెళ్తున్నారు. చంటిబిడ్డలను సైతం ప్రయాణికులు ఆటోల్లో తమ వెంట తీసుకుని వెళ్తూ ప్రయాణాలు చేస్తున్నారు. వేరే ప్రయాణ సదుపాయం లేక గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆటోలను ఎక్కుతున్నారు. పట్టణానికి వచ్చే ఆటోలు అడ్డదిడ్డంగా ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారుతున్నాయి.

నేడు విద్యార్థులకు అవగాహన సదస్సు

బుచ్చిరెడ్డిపాళెం : మాదకద్రవ్యాల నియంత్రణపై బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని డీఎల్ఎన్ఆర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు సెబ్ సీఐ సూర్యనారాయణ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి జరిగే అవగాహన సదస్సులో మండల స్థాయి అధికారులు పాల్గొంటారని తెలిపారు.

మండలంలో అకాల వర్షం

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని పలుచోట్ల బుధవారం భారీ వర్షం కురిసింది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం మండలంలో వరికోత జోరుగా సాగుతున్న తరుణంగా అకాల వర్షం రావడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. అంతే కాకుండా ఎక్కువ శాతం పంట కోత దశకు వచ్చి ఉండడంతో అకాల వర్షం కారణంగా పంట నేలవాలింది. దీంతో రైతులు పంటను రక్షించుకునేందుకు అవస్థలు పడుతున్నారు.

తగ్గుతున్న పప్పుధాన్యాల సాగు

- కలిసిరాని మెట్టపంటల సేద్యం
- అకాల వర్షాలు కూడా కారణం



గతేడాది సాగులో ఉన్న మినుము పంట(ఫైల్)

పొదలకూరు : పొదలకూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో పప్పుధాన్యాల సాగు గణనీయంగా తగ్గింది. అదనులో వర్షాలు కురుస్తున్నా కొంతకాలంగా మెట్టరైతులు అపరాల సాగు జోలికి వెళ్లడం లేదు. ప్రధానంగా మినుము, పెసర, పచ్చిశనగ పంటలను పొదలకూరు, రాపూరు, చేజర్ల, కలువాయి మండలాల్లో సాగు చేపడుతారు. ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో వర్షపాతాన్ని అనుసరించి రైతులు పప్పుధాన్యాల సాగు చేస్తుంటారు. ఫలితంగా రూ.కోట్లాది లావాదేవీలు ఈ ప్రాంతంలో పప్పుధాన్యాల సాగు వల్ల వ్యాపారులు, రైతుల మధ్య లావాదేవీలు నెలకొంటాయి. నాలుగు మండలాల్లో కలిపి సుమారు 20 వేల ఎకరాల్లో మినుము, పెసర పంటల సాగు చేపడుతుంటారు. దుక్కిదున్నకం పనుల నుంచి పంటలకు పురుగుమందుల పిచికారీ వరకు మెట్ట రైతులు సంక్రాంతి పండుగ వరకు వ్యవసాయ పనుల్లో తలమునకలై ఉంటారు. అంతేకాక రబీసీజన్ నవంబర్ నుంచి ప్రారంభం అయితే మాగాణి సేద్యం చేపట్టే రైతుకైతే ఊపిరి సలపని విధంగా వ్యవసాయ పనులు ఉంటాయి. అయితే ప్రస్తుతం ఈ ప్రాంతంలో రైతులు ఆశించిన స్థాయిలో మెట్ట పంటల సాగుకు సమాయత్తం కావడం లేదు. గతేడాది, అంతకుముందు ఏడాదితో పోల్చిచూస్తే పప్పుధాన్యాల సాగు బాగా తగ్గింది. వ్యవసాయ ఖర్చులు పెరగడమే కాక అకాల వర్షాల వల్ల మినుము, పెసర చేతికి వస్తుందనే నమ్మకం సన్నగిల్లడంతో రైతులు సాగు విస్తీర్ణం తగ్గించి పంటల మార్పిడికి అలవాటు పడుతున్నారు.

ఆర్బీకేల ద్వారా అవగాహన

వ్యవసాయశాఖ గ్రామాల్లో ఆర్బీకేల ద్వారా రైతులకు వ్యవసాయంపై అవగాహన కల్పిస్తోంది. ప్రధానంగా పంటల మార్పిడి పద్ధతికి రైతులు అలవాటు పడాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఇందుకోసం ఖరీఫ్‌లో మినుము, పెసర పంటలే సాగు చేయాల్సి పనిలేదని, అంతర్‌పంటగా కందిని సాగు చేస్తే రైతులు నష్టపోవాల్సిన అవసరం ఉండదని అవగాహన కల్పిస్తున్నారు. ఆర్బీకేల స్థాయిలో వ్యవసాయ సలహామండలి సభ్యులతో ముందుగా వ్యవసాయాధికారులు మాట్లాడి వారి ద్వారా రైతులకు వివరిస్తున్నారు. ఫలితంగా రైతులు పంటల మార్పిడికి మెల్లగా అలవాటు పడుతూ నష్టాలు చవిచూసే పంటలను సాగు చేయడం మానివేస్తున్నారు.



ఆర్బీకేలో రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయాధికారులు

ఇందులో భాగంగానే మినుము, పెసర పంటల సాగు విస్తీర్ణం తగ్గినట్లుగా అధికారులు భావిస్తున్నారు. వాటి స్థానంలో పత్తి, కంది, పచ్చిశనగ తదితర పంటలను సాగు చేస్తున్నారు.